


విద్యారంగంపై కేంద్రానికి చిన్న చూపు


ప్రజాశక్తి - కాకినాడ



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యా రంగం పట్ల చిన్నచూపు చూశారని యుటిఎఫ్ కాకినాడ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఐ.ప్రసాదరావు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 3.25 శాతం మాత్రమే నిధులు మంజూరు చేయడం దారుణమన్నారు. కనీసం 6 శాతం నిధులైనా కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. వేతన జీవులకు ఆదాయం పన్నులో కొత్త పద్ధతిలో పన్ను చెల్లించే వారికి మాత్రమే కొంతమేరకు ఉపశమనం కలిగించిందని, పాత పద్ధతిలో ఉన్న వారికి కూడా రాయితీలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

మళ్లీ మొండి చేయి

- పోలవరం నిర్వాసితుల ఊసెత్తని వైనం
- కోటిపల్లి - నరసాపురం రైల్వే లైన్‌కు కేటాయింపు నిల్
- పెట్రో కెమికల్ కాంప్లెక్ నిర్మాణంపై నీలినీడలు
- ప్రస్తావనకే రాని పిఠాపురం-కాకినాడ మెయిన్‌లైన్



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఈ సారి కూడా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు అన్యాయమే జరిగింది. కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న జిల్లా వాసుల ఆశలు ఆవిరయ్యాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం బడ్జెట్ కావడంతో విభజన సమయంలో జిల్లాకు ఇచ్చిన హామీలకు సంబంధించి నిధులు కేటాయిస్తారని ఆశించిన ప్రజలకు కేంద్రం మొండిచేయి చూపించింది. పోలవరానికి సంపూర్ణ సాయం అందిస్తామని మాత్రమే చెప్పుకొచ్చారు. పోలవరం ఎడమ కాలువ, నిర్వాసితుల సమస్యలపై కనీస ప్రస్తావన లేదు.

పోలవరం నిర్వాసితుల ఊసేలేదు

పోలవరానికి సంపూర్ణ సాయం అందిస్తామని చెప్పిన కేంద్ర ఆర్థిక మంత్రి, పోలవరం నిర్వాసితుల మాత్రం పట్టించుకోలేదు. పరిహారం అందించే దానికి నిధుల కేటాయింపు విషయంలో ఈసారీ మొండిచేయి చూపారు. తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలో తాగు, సాగునీరు, పరిశ్రమలకు అవసరమైన పోలవరం ఎడమ కాలువ పనులు ఏళ్లుగా ముందుకు సాగడం లేదు. నిధుల కొరతతో అనేక అడ్డంకులు ఏర్పడ్డాయి. దీనిపై స్పష్టత ఇవ్వలేదు.

కోనసీమకు మళ్లీ నిరాశే...

కోనసీమకు రైలు కూత కల ఇప్పట్లో నెరవేరేలా కనిపించట్లేదు. కోటిపల్లి – నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కలగానే మిగిలిపోయేలా ఉంది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలో ఉండడంతో ఈ ప్రాజెక్టుపై కోనసీమ వాసులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. కేంద్ర బడ్జెట్‌లో తప్పకుండా భారీగా నిధులు కేటాయింపు జరుగుతుందని ఆశించారు. కాని మంగళవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్లో కోటిపల్లి రైల్వే కోసం అసలు ప్రస్తావనే రాలేదు.

కానరాని పెట్రోకారిడార్

రూ.32 కోట్ల నిధులతో కాకినాడ పెట్రో కారిడార్ పేరుతో పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకొస్తామని ఎన్నో ఏళ్లుగా కేంద్రం హామీ ఇస్తూ వస్తోంది. కాకినాడ, తొండంగి, యు.కొత్తపల్లి మండలాల్లో సుమారు 14 వేల ఎకరాలు ఈ పరిశ్రమలకు కేటాయించాలని భావించారు. కేంద్రం నిధులు ఇస్తుందని ఎదురుచూస్తున్న ప్రజానీకానికి మరోసారి భంగపాటు కలిగింది. బడ్జెట్లో అసలు ప్రస్తావనకు రాలేదు. ఈ పెట్రో కారిడార్ ఏర్పాటైతే వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించే వీలుండేది. ప్రధానంగా కాకినాడ జిల్లా యువతకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉండేది. కానీ బిజెపి ప్రభుత్వం మరోసారి ఈ ప్రాజెక్టుకు బడ్జెట్లో నిధుల కేటాయింపు ప్రస్తావనను తీసుకురాలేకపోయింది.

పిఠాపురం మెయిన్ లైన్ హామీ గాలికి

దశాబ్దాల కాలం నుంచి కాకినాడ ప్రజలను ఊరిస్తున్న పిఠాపురం మెయిన్ లైన్ ప్రస్తావన ఈ బడ్జెట్లోనూ చోటు లేకుండా పోయింది. కాకినాడ నగరాన్ని విశాఖ-విజయవాడ మెయిన్ రైల్వేలైన్‌లోకి తీసుకువచ్చేందుకుగానూ పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపం నుంచి ప్రత్యేకంగా రైలుమార్గాన్ని నిర్మించి కాకినాడను కలుపుకుంటూ సామర్లకోట రైల్వేలైను మార్గంలో కలపాలని ప్రతిపాదించారు. 21.5 కిలోమీటర్లు ఉండే ఈ లైనుకు తొలుత రూ.48 కోట్లు అంచనా వేశారు. 2014-15లో రూ.220.30 కోట్లకు, 2017-18లో ఇది రూ.400కోట్లకు చేరుకుంది. ప్రస్తుతం పెరిగిన భూసేకరణ వ్యయంతో ఇతర రేట్లను పరిగణనలోకి తీసుకుంటే ఇది రూ.1,200-రూ.1,500కోట్లకు చేరుకుంటుందని అంచనా. దక్షిణ మధ్యరైల్వేలోనే కీలకమైన ఆదాయాన్ని ఆర్జించి పెడుతున్న కాకినాడ పోర్టు స్టేషన్ గూడ్స్ పరమైన అభివృద్ధి ప్రస్తావన లేకుండా పోయింది. అలాగే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేది వద్ద డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటు అంశం ఈ బడ్జెట్లో ప్రస్తావన లేదు.

జిల్లాకు తీవ్ర అన్యాయం

కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లా ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగింది. కాకినాడ పెట్రో కారిడార్, సెజ్ పరిశ్రమలు ప్రోత్సాహాలు ఏమి ప్రకటించలేదు. స్మార్ట్ సిటీ నిధులు, పిఠాపురం – కాకినాడ రైలు మెయిన్ లైన్ హామీ ఉత్తమాటగానే మిగిలిపోయింది. ఎరువులు, పురుగు మందులు తయారీ రసాయనాలపై పన్నులు పెంచడం వల్ల ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగే అవకాశం కల్పించింది. దీంతో రైతులపై భారీగా భారం పడే అవకాశం ఉంది.

- ఎం. రాజశేఖర్, సిపిఎం జిల్లా కన్వీనర్, కాకినాడ

కేంద్ర బడ్జెట్‌లో ఏపికి ఆశాజనకం

నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు ఆశాజనకంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రాజధాని అమరావతి నిర్మాణానికి బడ్జెట్లో రూ.15 వేల కోట్లు కేటాయించడంతో పాటు, ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు హామీ ఇవ్వడం హర్షించదగినది.

- తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్,కాకినాడ ఎంపీ

పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ : కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్, ఇతర అధికారులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రతాప్ నగర్ వంతెన నుంచి ఇంద్రపాలెం జంక్షన్ వరకు పరిశుభ్రతా కార్యక్రమాన్ని చేపట్టారు. డివైడర్లు, ఇతర ప్రాంతాల్లో పెరిగిన చెత్తను కమిషనర్ వెంకటరావుతో కలిసి కలెక్టర్ స్వయంగా తొలగించి స్ఫూర్తినిచ్చారు. మార్గ మధ్యలో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని నిర్మూలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా అనేక వ్యాధులకు దూరంగా ఉండవచ్చు నన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ప్రజల్లో మరింత అవగాహన కల్పించే లక్ష్యంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రతి నెలా చివరి వారంలో సోమవారం నుంచి శనివారం వివిధ ప్రాంతాలను శుభ్రం చేసే ప్రక్రియ చేపట్టామన్నారు. ప్రజల భాగస్వామ్యంతో కాకినాడ నగరాన్ని క్లీన్ సిటీగా తయారు చేయాలన్నదే ప్రధాన కర్తవ్య మన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకట రావు మాట్లాడుతూ స్వచ్ఛతా వారోత్సవాలలో అన్ని వర్గాల ప్రజలు, సేవా సంస్థలు, ఉద్యోగులు, విద్యా ర్థులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్మార్ట్ సిటీ ఎస్ఇ వెంకటరావు, ఇఇ మాధవి, ఎంహెచ్ఒ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు లాజర్, రవివర్మ, టిడిపి నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాలతో రాక్ కార్మికుల నిరసన



రాక్ సిరామిక్ గేటు ముందు ధర్నా చేస్తున్న కార్మికుల కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - సామర్లకోట

అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో రాక్ సిరామిక్ గేటు ముందు కార్మికులు వారి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ కార్మికులను విధుల నుంచి తొలగించి నేటికి 99 రోజులు అయిందన్నారు. కానీ నేటికి కార్మికులను విధుల్లోకి తీసుకోవడం లేదని అన్నారు. కార్మికులను వీధులపాలు చేసి మూడు నెలల కావడంతో ఆయా కార్మికుల కుటుంబాలు ఇంటి అద్దెలు కూడా చెల్లించు కోలేని పరిస్థితికి నెట్టబడ్డారని అన్నారు. కుటుంబాల పోషణ కష్టంగా మారిందని అన్నారు. అందుకే కుటుంబ సభ్యులతో కలిసి నేడు రోడ్డెక్కాల్సిన పరిస్థితిని యాజమాన్యమే తీసుకొచ్చిం దన్నారు. పలువురు కుటుంబ సభ్యులు మాట్లాడుతూ పాఠశాలల్లో ఫీజులు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. 18 నుంచి 20 సంవత్సరాల వరకూ కార్మికులు కంపెనీలో పని చేశారని, వారిని అర్థాంతరంగా విధుల నుంచి తొలగిస్తే వారు ఎలా జీవించగల్గుతారని ప్రశ్నించారు. తక్షణం విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో కుటుంబాలతో గేటు ముందు నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.క్రాంతికుమార్, ప్రయివేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు చింతల సత్యనారాయణ, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు గూనూరు రమణ, వడ్డి సత్యనారాయణ, సిఐటియు అధ్యక్షులు గడిగట్ల సత్తిబాబు, కారిమకులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి

ప్రజాశక్తి - కాకినాడరూరల్

సర్పవరం జంక్షన్‌లో బోటు క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంధాలయ విశ్రాంతి అధికారి చింతపల్లి సుబ్బారావు మాట్లాడారు. 1906 జూలై 23న ఉత్తరప్రదేశ్లో జన్మించిన ఆజాద్ భారత స్వాతంత్ర్య పోరాటంలో యువకుల తెగువను ప్రపంచానికి చాటి చెప్పారని అన్నారు. నాయకునిలా కాక ఒక సేవకుడిలా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు అని తెలిపారు. స్వాతంత్రం అంటే ఆత్మగౌరవం అని నిరూపించారని అన్నారు. 25వ ఏటనే ఆత్మ త్యాగం చేసిన ఆజాద్ దేశభక్తి ఎనలేనిదని సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.





తాత్కాలిక వంతెనపై నీటిలో నాయకులు

ముంపు బాధిత రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలో ముంపునకు గురియైన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం చేదువాడ, కాజులూరు, దుగ్గుదురు, ఉప్పుమిల్లి గ్రామాల్లో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వి.రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్ పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం డ్రెయిన్ల ఆధునికీకరణపై దృష్టి చూపకపో వడంతో ఇటీవల కురిసిన వర్షాలకు డ్రెయిన్లలో నీరు నిలిచిపోయి కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టారని అన్నారు. వర్షాలతో నీట మునిగిన పంటలకు సంబంధించి తక్షణమే నష్ట పరిహారం చెల్లించాలని, విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దుగ్గుదురు, కాజులూరు మధ్య ఉన్న అంద్రంగి డ్రెయిన్‌పై ఉన్న వంతెన శిధిలమవ్వడంతో తాత్కాలికంగా నిర్మించిన వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వంతెన నిర్మించాలని కోరారు. ఈ పర్యటనలో పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

అన్నదాతను ముంచిన వర్షాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలు అన్నదాతను నిండా ముంచాయి. ఖరీఫ్ సాగులో భాగంగా రైతులు దుక్కులు దున్ని, చదును చేసి, విత్తనాలు జల్లి, నారుమడి పూర్తు చేసి వరినాట్లు వేసుకున్న కొద్ది రోజుల్లనే వర్షం ముంచెత్తడంతో ఆదిలోనే వరి పంటను కోల్పోయి రైతన్నలు నష్టాన్ని చవిచూశారు. ప్రస్తుతానికి ఎకరానికి సుమారు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న నీరు పూర్తిగా తొలగితేనే నష్టం అంచనాలను వేసే పరిస్థితి నెలకుంది. ఈలోగా వరి నాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 6 వేల ఎకరాల వరకూ వరి నాట్లు పూర్తియ్యాయి. దీనిలో ప్రస్తుతం కురిసిన వర్షాల వల్ల సుమారు 800 ఎకరాల వరకూ నీటి మునిగిపోయింది. ప్రభుత్వం ఇస్తామన్నా పెట్టుబడి సాయం రూ.20 వేలు నేటికీ ఇవ్వకపోవడంతో అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. ఆదిలోనే పంట నష్ట పోవడంతో తిరిగి విత్తనాలు జల్లాలన్నా చేతిలో చిల్లి గవ్వ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మునిగిపోయిన పంటను చూస్తున్న రైతు

రూ.15 వేల వరకూ పెట్టుబడి పెట్టా...



70 సెంట్లు సొంతం పొలం, మిగిలిన 13 కుంచాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. వరి నాట్లు వేయడానికి రూ.15 వేల వరకూ ఖర్చు అయ్యింది. ప్రస్తుతం వర్షాల కారణంగా నారుమళ్లు ముంపునకు గురయ్యాయి. నీరు దిగేటప్పటికి ఎన్ని రోజులు పడుతుందో తెలియదు. ఈలోపు వరి నాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది.

- అనిశెట్టి సత్యనారాయణ, రైతు, లచ్చి పాలెం

ప్రభుత్వం సాయం అందించాలి



అధిక వర్షాల వల్ల పంటను కోల్పోయాం. పెట్టుబడి అంతా నీళ్లపాలైంది. కనీసం ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సాయం ఎకరాకు రూ.20 వేలు అయినా అందించాలి.

-ఎ.బుల్లయ్య, కౌలు రైతు, తాళ్లరేవు మండలం

నర్సింగ్ కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

రమ్య నర్సింగ్ కళాశాలలో సమస్యలు పరిష్కారం చేయాలని, అమ్మాయిలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ రమ్య కాలేజీలో బిఎస్‌సి నర్సింగ్ మొదటి, రెండవ సంవత్సరాలు చదువుతున్న విద్యార్థినిలు ఉన్నారని, అయితే వీరికి పూర్తిస్థాయిలో అధ్యాపకులు లేరన్నారు. అధ్యాపకులు లేకుండా విద్యార్థినిలు ఏవిధంగా ఉత్తీర్ణతను సాధిస్తారని ప్రశ్నించారు. తక్షణమే కళాశాలలో అధ్యాపకులను నియమించాలని, వసతి గృహంలో నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వసతి గృహానికి వార్డెన్ కూడా లేరని, కళాశాలకు ప్రిన్సిపల్ లేరని, దీంతో వారి సమస్యలు ఎవరితో చెప్పుకోవాలో తెలియని స్థితిలో విద్యార్థినిలు ఉన్నారని అన్నారు. రమ్య కళాశాల మేనేజర్ పితాని అన్నవరం విద్యార్థినిలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారని, తక్షణహే ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థినీలు

అనంతరం కలెక్టరేట్ నుంచి డిఎంహెచ్ఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిఎంహెచ్ఒ నరసింహ నాయక్‌కు అందచేశారు. ఈ కార్యక్రమంలో రమ్య కళాశాల విద్యార్థినీలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు, నగర అధ్యక్ష, కార్యదర్శులు సంజయ్, వాసు, నాయకులు విపిన్, విశాల్ పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట



ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్

స్థానిక భీమేశ్వరాలయంలో కలెక్టర్ షాన్ మోహన్ ప్రత్యేక పూజలు చేశారు. పెద్దాపురం నియోజక వర్గం పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటలకు ఆయన భీమేశ్వరాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కార్యనిర్వా హనాధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ పర్యటనలో తహశీల్దార్ వై.శ్రీనివాసరావు, విఆర్ఒలు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధ్యాపకులకు వృత్తి నైపుణ్య శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి



అతిథులకు మొక్కను అందిస్తున్న నిర్వాహకులు

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఆదిత్య లెర్నింగ్ అకాడమీ సహకారంతో ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడాలజీస్‌పై ఐదు రోజుల వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించినట్లు డిప్యూటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన 70 మంది అధ్యాపకులకు బోధనా పద్ధతులను మెరుగుపర్చడం కోసం ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. రిసోర్స్‌పర్సన్‌లు డాక్టర్ డి.లక్ష్మి, ఇఎల్‌టి కన్సల్టెంట్ రుచి తోమర్, మల్లికార్జున నాయుడు పచ్చిపాల శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి. సురేష్, డీన్ డాక్టర్ జి.రామకృష్ణ పాల్గొన్నారు.

డ్రెయిన్ల ఆధునికీకరణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి - కాజులూరు



కాలువను పరిశీలిస్తున్న సత్యం

డ్రెయిన్ల ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం తెలిపారు. మంగళవారం మండలంలోని ఆర్యవటం, గొల్లపాలెం గ్రామాలకు చెందిన రైతులు మంత్రిని కలుసుకునేందుకు రాగా ఆయన లేకపోవడంతో మంత్రి తండ్రి సత్యంకు వారి బాధలను వివరించారు. వెంటనే ఆయన కూరాడ డ్రెయిన్, రాజు డ్రెయిన్లను పరిశీలించారు. రైతుల సమస్యను ఆయన చరవాణి ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఆదేశాలతో డ్రెయినేజీ శాఖ అధికారులు కురాడ డ్రెయిన్, రాజు డ్రెయిన్లలో పూడిక తీతను ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన మంత్రి సుభాష్‌తోపాటు, ఆయన తండ్రికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు యూనిఫారం, బ్యాగ్‌ల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు


మండలంలోని పి.మల్లవరం జడ్‌పి, పత్తిగొంది పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన యూనిఫారం, బ్యాగ్‌లు పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. స్వచ్ఛతా వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన డ్రాయింగ్, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు శ్రీనివాసరావు, పేర్రాజు, వుంగరాల వెంకటేశ్వరరావు, ఎంపిటిసి సభ్యులు దున్నా రాంబాబు, స్థానిక నాయకులు ధూళిపూడి వెంకటరమణ విళ్ళ సత్యనారాయణ, పంపన రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలకే సరుకులు విక్రయించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులను విక్రయించాలని లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ మోహన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక దర్గాసెంటర్‌లోని రిలయన్స్ స్మార్ట్ బజార్‌ను డిసిసిపి విజిలెన్స్ కమిటీ మెంబర్ బి.సూర్యనారాయణమూర్తి, వినియోగదారుల సంఘం సెక్రటరీ భాస్కర రావులతో కలిసి సరుకుల విక్రయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్కువ ధరకు ఏర్పాటుచేసిన నిత్యావసర సరుకులు ఫైన్ సోనామసూరి, బిపిటి స్టీమ్ బియ్యం కిలో రూ 49 కి, పచ్చి ఫైన్ సోనామసూరి, బిపిటి బియ్యం కిలో రూ.48, దేశవాళీ రకం కందిపప్పు కిలో రూ.160కి విక్రయించాలన్నారు. ధరలు వినియోగదారులకు కనబడేలా బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కార్టూ'నిజం'



పెద్దాపురం, సామర్లకోటలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మంగళవారం పెద్దాపురం, సామర్లకోట మండలాల్లో పర్యటించారు. తొలుతగా పెద్దాపురం పట్టణ పరిధిలోని బిసి, ఎస్‌సి సంక్షేమ వసతి గృహాలు, జి.రాగంపేట జగనన్న కాలనీ, పులిమేరు గ్రామ పిహెచ్‌సిని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అలాగే కాండ్రకోటలోని దబ్బ కాలువపై వంతెన నిర్మాణ పనులు పరిశీలించారు. ఆయా ప్రదేశాల్లో నెలకున్న సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని, జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, రోగులకు వైద్య సేవలను అందించాలని ఆదేశించారు. దబ్బ కాలువపై వంతెన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అలాగే సామర్లకోట మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, వైద్య ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఇరిగేషన్ పనులను ఆయా శాఖల అధికారులతో కలసి విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనల తోపాటు, హెచ్చరికలు చేశారు. అచ్చంపేటలో ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డును పరిశీలించారు. సురక్షిత మంచినీటి ట్యాంక్‌ను పరిశీలించి నీటిలో ఇన్‌లైన్ క్లోరినేషన్ శాతంపై పంచాయితీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆరా తీశారు. ఉండూరు జడ్‌పి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల పనితీరుపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను రుచిచూశారు. అనంతరం సామర్లకోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించారు. ఆసుపత్రిలో వార్డులు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం హుస్సేన్‌పురం గ్రామ పరిధిలోని గోదావరి కాలువలో జరుగుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వేట్లపాలెం జడ్‌పి హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఈ పర్యటనలో జడ్‌పి సిఇఒ సత్యనారాయణ, డిపిఒ భారతిసౌజన్య, ఆర్‌డిఒ జె.సీతారామారావు, అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ సరిత, తహశీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఒ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి, సామర్లకోట ప్రత్యేక అధికారి పి.రాధాకృష్ణ, సామర్లకోట మండల తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎంపిడిఒ శ్యాంసుందర్, ఇఒపిఆర్‌డి కర్రి హరికష్ణ సత్యారెడ్డి, ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సామర్లకోటలో మిడ్డేమీల్స్‌ను రుచిచూస్తున్న కలెక్టర్



లీకేజీ పైపులైన్‌కు మరమ్మతులు

లీకేజీలకు మరమ్మతులు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఎండపల్లి జంక్షన్ సమీపంలో లీకేజీ అవుతున్న తాగునీటి పైపులైనుకు మరమ్మతులు చేపట్టారు. ఈనెల 19న 'లీకేజీలకు మోక్షం ఎప్పుడో' అనే కథనం ద్వారా ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చింది. ఈ కథనంపై స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో సంబంధిత శాఖ సిబ్బంది మంగళవారం మరమ్మతులు చేపట్టారు. దీనిపై స్థానిక ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవ చూపిన ప్రజాశక్తిని ప్రజలు అభినందించారు.

నేరాలు ఘోరాలు

గల్లంతైన బాలుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - సీతానగరం

మిర్తిపాడు కాజ్‌వే వద్ద గల్లంతైన సీతానగరం మండలం ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన పిప్పళ్ల రాంబాబు(14) మృతదేహం మంగళవారం లభ్యమైంది. తండ్రి మందలించడంతో రాంబాబు సైకిల్‌పై బయటకు వెళ్లిపోయాడు. మిర్తిపాడు కాజ్‌వే వద్ద బాలుని సైకిల్‌ను గుర్తించారు. సోమవారం అతని ఆచూకీ లభించలేదు. మంగళవారం తెల్లవారుజాము నుంచి బాలుని కోసం ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు గాలించాయి. రాంబాబు మృతదేహన్ని కనుగొన్నారు. మృతదేహన్ని చూసి తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందర్నీ కలచివేసింది. బాలుడు చదువుతున్న తిరుమల స్కూల్‌తో పాటు ఉండేశ్వరపురంలో విషాదం నెలకొంది. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - సామర్లకోట

స్థానిక రైల్వే ఓవర్ బ్రిడ్జి దిగువన స్కూల్ పిల్లలను ఎక్కించుకుంటున్న కాకినాడకు చెందిన ప్రయివేటు స్కూల్ బస్సును వెనుక నుంచి లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. దీంతో అంతా ఊపిరి పీల్చు కున్నారు. పిల్లలను వేరొక బస్సులో తరలించారు. పెద్దాపురం నుంచి కాకినాడ వెళుతున్న స్కూల్ బస్సు పాత రిజిస్ట్రార్ కార్యాలయం సెంటర్‌లో ఆపి విద్యార్థులను ఎక్కించు కుంటుండగా తెలంగాణ రాష్ట్ర గజ్వేల్ నుంచి బియ్యం లోడుతో కాకినాడ పోర్టు కు వెళుతున్న లారీ ఆగివున్న స్కూల్ బస్సును వెనుకనుంచి ఢీ కొట్టింది. దీంతో బస్సు వెనుకన ఉన్న అద్దాలు పగిలి బస్సు పాక్షికంగా దెబ్బ తింది. ఆ సమయంలో బస్సులో 20 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదానికి కారణమైన లారీని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీడిన మిస్సింగ్ కేసు మిస్టరీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం పోలీసు స్టేషన్‌లో బాలల మిస్సింగ్ కేసును ఛేదించినట్టు ఎస్‌ఐ జానీ బాషా తెలిపారు. కె.గంగవరం గ్రామానికి చెందిన పెద్దింశెట్టి సత్యనారాయణ పాఠశాలకు వెళ్లిన తన కుమార్తె వాగ్దేవి, కుమారుడు ప్రవీణ్ కనిపించడం లేదని స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్‌ఐ కె.చిరంజీవి కేసు నమోదు చేశారు. ఈ కేసులో సాంకేతిక పరిజ్ఞానంతో పిల్లల ఆచూకీ కనుగొన్నామని తెలిపారు. పిల్లలను వారి తల్లి దుర్గా భవాని మహాలక్ష్మి తనతో హైదరాబాద్ తీసుకెళ్లి పోయిందని, అక్కడ పని చేసుకుని పిల్లలను పోషించుకుంటుందని వివరించారు. వారిని ఇక్కడకు తీసుకువచ్చి పెద్దల సమక్షంలో అప్పగించారు.

గాయపరిచిన వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

ఒక వ్యక్తిని బీరు బాటిల్‌తో కొట్టి గాయపరిచిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన మిత్తిరెడ్డి వాసు కుమార్ సోమవారం సాయంత్రం బ్యారేజ్ దగ్గర ఉండగా అదే గ్రామానికి చెందిన రమేష్, చంటి వాసుతో గొడవపడ్డారు. బీరు బాటిల్తో కొట్టి గాయపరిచారు. వెంటనే అతనిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుండి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎస్ శ్రీనివాస్ తెలిపారు

బెదిరించిన వారిపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

భార్యాభర్తలను బెదిరించి భయభ్రాంతులకు గురి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బొబ్బర్లంక గ్రామానికి చెందిన నెల్లి హేమలత, ఆమె భర్త గంగబాబు చేపల వేట చేసుకుని జీవిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు సోమవారం హేమలతను భర్త గంగ బాబును, వారి కుటుంబ సభ్యులను దుర్భాషలాడి భయభ్రాంతులకు గురిచేసి బెదిరించారు. దీంతో హేమలత స్థానిక స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

మోటార్ల చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని వెదురుమూడి షిరిడి సాయి రైస్ మిల్లులో 8 విద్యుత్ మోటార్లు పంపులు, మండపేటలో 3 మోటార్ పంపులు చోరీ చేసిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు అంగర ఎస్‌ఐ పరదేశి తెలిపారు. మండపేట మండలం ఏడిదకు చెందిన బొచ్చ తరుణ్, గోకవరం మండలం ఎర్రంపాలెంకు చెందిన అలగిరి సత్యసాయి, చిట్టిగణేష్, ఏడిద గ్రామానికి చెందిన కాలే సుబ్రమణ్యంను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 11 ఎలక్ట్రిక్ మోటార్లు, పల్సర్ బైక్, మోటార్లు విప్పే పనిముట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను ఆలమూరు కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్‌ఐ తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడి కైకాలపేటకి చెందిన ఒక మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన నిందితుడు గెడ్డం సత్యనారాయణ మూర్తిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు నగరం ఎస్ ఐ పి.సురేష్ తెలిపారు వరుసకి మరిది అయ్యే నిందితుడు బాధితురాలిపై కన్నేసి వంట గదిలో ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచార యత్నానికి పాల్పడ్డాడని ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో పరారైట్టు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలు

ప్రజాశక్తి - గోకవరం

మండలంలో వీరలంకపల్లిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వీరలంకపల్లికి చెందిన వల్లభశెట్టి రమేష్ గుమ్మళ్లదొడ్డి గ్రామంలో గల ఇథనాల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం విధులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వస్తున్నాడు. వీరలంకపల్లి జంక్షన్ వద్దకు వచ్చేసరికి బుల్లెట్‌పై వస్తున్న వ్యక్తి వేగంగా వచ్చి రమేష్ బైకును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రమేష్‌కి తీవ్ర గాయాలయ్యాయి. రమేష్ భార్య వల్లభశెట్టి దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెచ్‌సి


వరి పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

మునిగిన పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని మురారి గ్రామంలో వర్షాలతో మునిగిపోయిన పంట పొలాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి ఆధ్వర్యంలో సంబంధిత శాఖ అధికారులు శ్రీహరి, సంజీవ్ మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎడతెరిపిలేకుండా వర్షాలు పడుతున్న కారణంగా వివిధ దశల్లో ఉన్న వరి పంట పై నీటిముంపు ప్రభావం లేకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పొలంలో నిలిచిపోయిన నీరు మురుగు కాలువల ద్వారా బయటకు వెళ్ళేటట్లు బాటలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో గ్రామ ఉపసర్పంచ్ జాస్తి వసంత్, రైతులు లక్ష్మణదొర, తాతారావు, పద్మనాభ చౌదరి, నాగ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా తోట పవన్ పుట్టిన రోజు వేడుక

ప్రజాశక్తి - యానాం, తాళ్లరేవు


యానాంలో పవన్‌కు గజమాల వేస్తున్న అభిమానులు

ప్రముఖ వ్యాపారి తోట రాజు తనయుడు తోట పవన్ పుట్టినరోజు వేడుకలను అభిమానులు అత్యంత ఘనంగా నిర్వహించారు. మంగళవారం యానాం - ద్రాక్షారామ రోడ్డులోని సుంకరపాలెం బైపాస్ జంక్షన్ వద్ద పవన్‌తో అభిమానులు భారీ కేక్ కట్ చేయించి బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్లోని డాక్టర్ బిఆర అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సర్కిల్ వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ కట్ చేశారు. అనంతరం చిన్న సెంటర్లోని, మార్కెట్ సెంటర్, జిఎంసి బాలయోగి స్టేడియం సెంటర్ వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన కేకులు కట్ చేస్తూ ర్యాలీ సాగింది. స్టేట్ బ్యాంక్ మీదుగా సుంకరపాలెం తోట రాజు షోరూమ్ వద్ద ఈ ర్యాలీ ముగిసింది. దారిపొడవునా అబిమానులు పూల వర్షం కురిపించారు. బారీ బాణాసంచా కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. తోట రాజు షోరూం వద్ద 27 కేజీల కేకును పవన్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రరం, కాకినాడ, తాళ్లరేవు, ముమ్మిడివరం కూటమి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కుడిపూడి శివన్నారాయణ, వడ్డి ఏడుకొండలు, రాయుడు సునీత తదితరులు పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవులో తోట పవన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక హోండా షోరూంలో కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో యడ్ల కుటుంబరావు, బొంతు శ్రీనివాస్, దున్న ఎల్లారావు, మురళి, కె.మల్లేష్ పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - తాళ్ళరేవు


సమావేశంలో మాట్లాడుతున్న నిభావని

బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించిన కఠిన చర్యలు తప్పవని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నిభావని హెచ్చరించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని బాల్య వివాహాల వల్ల అనర్థాలు, వాటిని ప్రోత్సాహించే వారిపై చట్ట ప్రకారం చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువు పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి


మిడ్డే మీల్స్ పంపిణీని పరిశీలిస్తున్న డివైఇఒ

విద్యార్థుల చదువు పట్ల ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని డివైఇఒ నాయుడు వెంకటేశ్వర అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పి.నాయకంపల్లి జడ్‌పి ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో అమలవుతున్న విద్యా కార్యక్రమాలు వివరాలను హెచ్‌ఎం ఎం.చిన్నరాజు ఆయనకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం, పాఠశాలలో మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మెరుగైన రీతిలో విద్యను అభ్యసించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఈ పర్యటనలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు ఫణికుమార్, వెంకటేశ్వరరావు, రామ్మూర్తి, అన్నపూర్ణ, ఉదయశ్రీ పాల్గొన్నారు.

రైతు సమస్యలపై అసెంబ్లీలో బండారు గళం

ప్రజాశక్తి-ఆత్రేయపురం, కొత్తపేట

అమరావతి అసెంబ్లీ సమావేశాలు జరుగుచున్న తరుణంలో కోనసీమలో రైతుల సమస్యలపై కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు మంగళవారం గళంమెత్తారు. ఆత్రేయపురం మండలం లొల్ల, ర్యాలీలో లాకులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయన్నారు. అవి ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉందన్నారు. లాకుల పునర్నిర్మాణానికి సుమారు రూ.60 కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు.

బాలాజీ దర్శనం వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి -మామిడికుదురు రూరల్

గోదావరి వరద ఉదతంగా పరగడంతో మంగళవారం అప్పనపల్లి వచ్చే ప్రధాన రహదారి నీటమునిగింది. రాకపోకలు సంభవించిపోయాయి వరద ఉదతి పెరుగుతున్నదున సుదూర ప్రాంతాల నుంచి బాల బాలాజీ స్వామి దర్శనం కోసం వచ్చేవారు తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు.

త్వరలో స్వదేశానికి వీరేంద్ర కుమార్

ప్రజాశక్తి-అమలాపురం

ఒక ఏజెంట్‌ను నమ్మి కతార్ దేశానికి పని కోసం వెళ్లి మోసపోయి సౌదీ అరేబియాలో ఒంటెల కాపరిగా పనిఅంబాజీపేట మండలం ఇసుకపూడి గ్రామానికి చెందిన సరెళ్ల వీరేంద్ర కుమార్‌ను సౌదీ అరేబియా నుంచి ఇండియాకు తీసుకురావడనికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్టు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. రీజినల్ పాస్పోర్ట్ ఆఫీసర్ ద్వారా సౌదీ అరేబియాలోని ఇండియన్ ఎంబసీ అధికారులతో వీరేంద్ర కుమార్‌ను ఇండియాకు తీసుకొచ్చే విషయమై కలెక్టర్ మాట్లాడారు. సౌదీ అరేబియా దామామ్‌లోని కింగ్ ఫహద్ విమానాశ్రయం నుంచి హైదరాబాదులోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి వీరేంద్ర కుమార్‌ను తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు.

ఇంటింటికీ రక్షిత మంచినీరు

ప్రజాశక్తి - ఆలమూరు

ఇంటింటికీ రక్షిత మంచినీరు అందించే దిశగా కృత నిత్యయంతో రక్షిత మంచినీటి సరఫరా శాఖ పని చేస్తుందని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ వి.విజయకుమార్ అన్నారు. మండలంలోని చెముడులంక శివారు గాంధీనగరం జాతీయ రహదారి ప్రక్కన 40 వేల లీటర్ల సామర్థ్యంతో రూ.37 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకును మంగళవారం జెఇ పి.పద్మ, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. గాంధీనగరంలో 400 మీటర్ల పైప్ లైన్, కుళాయిలను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఏయే ప్రాంతాల్లో కుళాయిలు నిర్మించాలనే దానిపై ఆ ప్రాంత ప్రజల అభిప్రాయాలను సేకరణ జరుగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యు.రేణుక, దేవి, నేత అడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అమలాపురం

పాఠశాలలు ప్రారంభమైన నేటికీ నెల రోజులు కావస్తున్నా అకడమిక్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం యుటిఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షులు పెంకె వెంకటేశ్వరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలైన జిఒ నెంబర్ 117 రద్దు, తెలుగు ఇంగ్లీష్ మీడియం రెండు ప్రభుత్వ పాఠశాలలో తీసుకురావాలన్నారు. మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టులు అప్ గ్రేడ్ చేయాలని టీచర్ల బదిలీలు ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉన్నత పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బంది నియమించాలని పాఠశాలకు గ్రాంట్లు మెయింటినెన్స్ గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు.


విద్యార్థికి నగదు అందజేస్తున్న కలెక్టర్, సంక్షేమ సంఘ సభ్యులు

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అమలాపురం

ఐఐటి ధన్‌బాద్ సీటు సాధించిన విద్యార్థినికి ఎపి షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సమకూర్చిన రూ.50 వేల నగదును కలెక్టర్ మహేష్ కుమార్ ద్వారా మంగళవారం విద్యార్థికి అందించారు. ఐఐటిలో సీటు సాధించి ఫీజు కట్టడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రావులపాలెం మండలం పొడగట్లపల్లికి చెందిన బట్టు మంజులకు ఈ సాయం అందింఆచరు. విద్యార్థినికి కలెక్టకర్ శుభాకాంక్షలు తెలియజేశారు. సంక్షేమ సంఘం చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల నకుల రాజు, ప్రధాన కార్యదర్శి గోసంగి బంగారాజు, ఆర్థిక కార్యదర్శి సాధనాల సత్యనారాయణ, ఆర్గనైజర్ సెక్రటరీ గెడ్డం ప్రదీప్, మంగం సుధాకర్, అదనపు కార్యదర్శి బయ్య మోహనరావు, భూపతి మనోహర్ రాజు, బిఎస్ఆర్.ప్రసాద్, దార శ్రీకాంత్, ముత్తాబత్తుల శ్రీనివాసరావు, విప్పర్తి కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టు రక్షణ చర్యల్లో కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

కోటిపల్లి నుండి సుందరపల్లి మధ్య గోదావరి ఏటిగట్టు బలహీన ప్రాంతాల్లో కాంగ్రెస్ నాయకులు ఇసుక వేసి శ్రమదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కోట శ్రీనివాసరావు కాంగ్రెస్ నాయకులు దీనిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం గోదావరిలో ఇసుకను తరలించడానికి ప్రాధాన్యత ఇచింది తప్ప గోదావరి ఏటుగట్టను అభివద్ధి చేయలేదన్నారు. గోదావరి ఉధతంగా ప్రవహిస్తున్న కారణంతో కరకట్ట బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రజలు బతుకుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి గోదావరి కరకట్టను పునర్నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.గంగవరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంగ ఉదయ్ కుమార్, సురేష్ పాలిక శివయ్య, నాగేశ్వరరావు, వాసంశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇసుక మేటల తొలగింపు

ప్రజాశక్తి - అమలాపురం

అల్లవరం మండలం రామేశ్వరం మొగలో ఇసుక మేటలు తొలగించి ముంపు నీరు సముద్రంలోకి దిగేందుకు మార్గం సుగమం చేసినట్టు కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తెలిపారు. ఏటా వేసవికాలంలో డ్రైన్‌లో నీరు లేకపోవడం, సముద్రపు అలల కారణంగా ఇసుక మేటలు వేసి రామేశ్వరం మొగ మూసుకుపోతుందన్నారు. భారీ వర్షాలు, వరదల సమయంలో అమలాపురం, అల్లవరం ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలాలో సుమారు 30 వేల ఎకరాల్లో మొగ పూడిక వల్ల ముంపు నీరు కిందకి దిగక పంట పొలాల్లో నీరు చేరి నష్టం వాటిల్లుతోందన్నారు. ఈ మొగను తెరవడం ద్వారా డ్రైన్‌ల ద్వారా ముంపు నీరు సముద్రంలోకి దిగుతుందన్నారు.

ముంపు చేలను పరిశీలించిన నులుకుర్తి

ప్రజాశక్తి - కరప


మునిగిన పొలాలను పరిశీలిస్తున్న నులుకుర్తి

వర్షాలకు నీట మునిగిన పంటలను కాకినాడ రూరల్ నియోజకవర్గ టిడిపి ఎన్నికల కో-ఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు పరిశీలించారు. మంగళవారం మండల పరిధిలోని వాకాడ, యండమూరు, పెద్దాపుర ప్పాడులోని వి.సావారం ప్రాంతాల్లో ముంపు భారిన పడ్డా పొలాలను కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సుమారు 1225 ఎకరాలు ముంపుకు గురైనట్లు వ్యవసాయ అధికారులు ఒక అంచనాకు వచ్చారని ఆయన తెలిపారు. నీరు తగ్గిన తర్వాత పంట నష్టం అంచనాలు ప్రారంభించేందుకు చర్యలు చేపడతారన్నారు. రైతుల అధైర్య పడొద్దదని, ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దేవు వెంకటేశ్వరరావు, గండి వెంకటేశ్వరరావు, ఆచంట సూరిబాబు, సర్వశుద్ధి ఏడుకొండలు, మేడిశెట్టి విష్ణు, దమ్ము నూకరాజు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాన్ని పరిశీలించిన ఎంఎల్ఎ తనయుడు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం తిమ్మాపురం గ్రామ పరిధిలో నీట మునిగిన పంటలను ఎంఎల్‌ఎ పంతం నానాజీ తనయుడు పంతం సందీప్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల దిగువ కాలువలను గుర్రపు డెక్క పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో నేడు ఆవ భూముల్లో సుమారు 360 ఎకరాలు పంట నీట మునిగిందని వివరించారు. దీంతో వెంటనే ఆయన అధికారులతో చరవాణి ద్వారా మాట్లాడారు. తక్షణమే కాలువలో ఉన్న పూడికను తొలగించాలని, అందుకు అయ్యే ఖర్చును తాము భరిస్తానని చెప్పారు. కావున వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. దీంతో అధికారులు పూడిక తీత పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - కరప

పేకాట ఆడుతూ పట్టుబడిన ఆరుగురుపై కేసు నమోదు చేసినట్లు కరప ఎస్‌ఐ టి.రామకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన తెలిపిన వివరాల మేరకు పెనుగుదురు గ్రామంలో రామలయం దగ్గరలో కొంత మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని వచ్చిన సమాచారంతో దాడి చేసి ఆరుగురుని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి రూ.5050లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలం రమణయ్యపేటలోని ఎపిఎస్‌పి స్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తు న్న స్టూడెంట్స్ కిట్స్‌ను ఇన్‌ఛార్జ్ ఎంపిపి బందిలి విరీషా పంపిణీ చేశారు. స్కూల్ ప్రిన్సిపల్ గాయత్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలి

ప్రజాశక్తి - యానాం

ఎంబిబిఎస్ తదితర వైద్య కోర్సుల్లో ప్రవేశానికి నీట్‌లో అర్హత సాధించినవారంతా నిర్ణీత ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకోవాలని పుదుచ్చేరి సెంటాక్ కోఆర్డినేటర్ అమన్ శర్మ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎంసిసి ప్రవేశాలకు సంబంధిత సంస్థ నుంచి ఆదేశాలు రాగానే కౌన్సెలింగ్‌ను ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. యానాం ఏరియాకు సంబంధించిన అభ్యర్థులు స్థానికత, కుల, స్థానిక రిజర్వేషన్, తెలుగు మైనారిటీ తదితర అన్నిరకాల పత్రాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.